ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి, ప్రాజెక్టు ప్రతినిధులు

అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలు

● ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్

రామగిరి, మార్చి 3: ఎంజీయూలో అత్యంత ఆధునిక టెక్నాలజీతో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేయనున్నట్లు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు. ఇంజినీరింగ్ ప్రాజెక్టు ఇండియా లిమిటెడ్‌తో క్రీడా ప్రాంగణాల అభివృద్ధిపై అవగాహన ఒప్పంద సమావేశం సోమవారం ఎంజీయూలోని వీసీ చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీలోని 21,609 స్క్వేర్ మీటర్ల ఇండోర్ స్టేడియంలో ఫ్లోరింగ్, ఎనిమిది లైన్ల సింథటిక్ ట్రాక్ నిర్మాణాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. ఇండోర్ స్టేడియంలో బాస్కెట్‌బాల్, వాలీబాల్, షటిల్ కోర్టులు ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులకు ఆయా అంశాలల్లో శిక్షణ ఇచ్చి వారిని ఆయా క్రీడల్లో తీర్చి దిద్దనున్నట్లు చెప్పారు. ఇంజినీరింగ్ ప్రాజెక్టు ఇండియా లిమిటెడ్ ప్రతినిధులు నారాయణ్ నాయక్ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అందుబాటులో ఉండేలా అత్యంత ఆధునిక క్రీడా మైదానాలను నిర్మిస్తామన్నారు. అనంతరం వారు ఎంజీయూ వీసీ, రిజిస్ట్రార్‌తో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి, ఇన్‌స్ట్రక్చరల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆకుల రవి, స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ హరీశ్‌కుమార్, సహాయ కార్యదర్శులు, ఆర్.మురళీ, వై.శ్రీనివాస్‌రెడ్డి, కో ఆర్డినేటర్ చింత శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 10 నిమిషాల సడలింపు ఇవ్వాలి

ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శికి బీసీ సంక్షేమ సంఘం వినతి

అధికారికి వినతిపత్రం అందిస్తున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ, మార్చి3 : ఇంటర్మీడియట్‌లో పది నిమిషాల నిబంధనలకు సడలింపు ఇవ్వాలని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి శ్రీకృష్ణ ఆదిత్యకు వినతి పత్రం అందించినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించకపోవడంతో చాలా మంది విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సకాలంలో బస్సులు దొరక్క, పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య వల్ల వారు సమయానికి హాజరు కాలేని పరిస్థితులు ఉంటాయన్నారు. ఈ నిబంధనతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని పది నిమిషాల సడలింపు ఇవ్వాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో బూర శ్రీనివాస్ గౌడ్, బండి నరేశ్, చంద్రమోహన్‌రాయ్, గోదా రవీందర్ ఉన్నారు.

కృష్ణమూర్తికి కుటుంబానికి రవీంద్రకుమార్ పరామర్శ

పెద్దఅడిశర్లపల్లి, మార్చి 3 : గుడిపల్లి మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు మారం కృష్ణమూర్తి సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

108 అంబులెన్స్ ప్రారంభం

అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న మేనేజర్ నజీరొద్దీన్

నిడమనూరు, మార్చి 3 : మండలానికి కేటాయించిన 108 అంబులెన్స్‌ను సోమవారం మం డల కేంద్రంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నజీరొద్దీన్, జిల్లా మేనేజర్ మధు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో, అన్ని రకాల అత్యవసర వైద్య పరికరాలు, అత్యవసర మందులతో కొత్త అంబులెన్స్ వాహనాన్ని అందించిందన్నారు. జీపీఎస్ అనుసంధానంతో, అధునాతన సౌకర్యాలతో వాహనం ప్రజలకు సేవలు అందించనున్నట్లు వారు తెలిపారు. ప్రజలు 108 వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈఎంటీ యాదగిరి, ప్రతాప్, పైలట్ గోవింద్ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన గురుకుల విద్యార్థినులు

తైక్వాండో పోటీల్లో గురుకుల విద్యార్థినుల ప్రతిభ

నల్లగొండ రూరల్/ మునుగోడు, మార్చి 3: ఈ నెల 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన 13వ ఓపెన్ లెవల్ ఇంటర్ స్కూల్ తైక్వాండో పోటీల్లో మునుగోడులోని మహాత్మా జ్యోతి బాపూలే బాలికల పాఠశాల విద్యార్థినీలు ప్రతిభ కనబర్చినట్లు కోచ్ అంబటి ప్రణీత్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన విద్యార్థినులు రెండు బంగారు, 4 వెండి, రెండు కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థినులను సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు, తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ నల్లగొండ ప్రధాన కార్యదర్శి ఎండీ. యూనస్ కమాల్ అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్య

కోదాడ రూరల్, మార్చి 3: ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కోదాడ పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధి హుజూర్‌నగర్ రోడ్డులోని పశువుల సంత ఎదురు వీధిలో నివాసం ఉంటున్న సుతారి మేస్త్రీ వేముల బాలరాజు (33) సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుట్టు మిషన్ పని నిమిత్తం బయటకు వెళ్లిన భార్య తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి బాలరాజు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. కాగా, బాలరాజుకు ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

పేద విద్యార్థులకు బెడ్‌షీట్లు పంపిణీ

విద్యార్థులకు బెడ్‌షీట్లు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

మిర్యాలగూడ, మార్చి 3: పట్టణంలోని మిరియం అనాథాశ్రమంలోని పేద విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ అధ్యక్ష, కార్యదర్శులు ఎనిగండ్ల లింగయ్య, బీఎం. నాయు డు సోమవారం బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యావేత్త ముడుంబై రామానుజాచార్యులు 75వ జయంతి సందర్భంగా ఆయన సతీమణి ముడుంబై మంగతాయారు వీటిని అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మొక్కపాటి వెంకటేశ్వర్లు, డాక్టర్ రాజు, పాశం రవీందర్‌రెడ్డి, నీలా మోహన్‌రావు, గుండా రామారావు, అనంతరెడ్డి, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న జడ్జి కులకర్ణి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అధికారులు

వేధింపులకు గురైన మహిళ లకు అండగా నిలువాలి

● జిల్లా అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కులకర్ణి

నీలగిరి, మార్చి 3 : లైంగిక వేధింపులకు గురైన మహిళలకు అండగా ఉండేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కులకర్ణి అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో లైంగిక వేధింపులకు గురైన మహిళలకు అందించాల్సిన తక్షణ సాయంపై లీగల్, మెడికల్, మహిళా శిశు సంక్షేమ శాఖలతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత, పిల్లల రక్షణ, బాధితులకు న్యాయ సాయం అందిచడంలో సంబంధిత విభాగాల మధ్య సమన్వయం ఉండాలన్నారు. లైంగిక వేధింపులు, గృహహింస, హింసకు గురైన బాలలకు న్యాయ, వైద్య మానసిక మద్దతు అందించాలని సూచించారు. మహిళలపై జరిగే నేరాల విషయంలో భరోసా కేంద్రం కృషిని ఆమె ప్రశంసించారు. శాఖల మధ్య సమన్వయాన్ని మెరుగు పర్చి బాధితులకు తక్షణ న్యాయంతో పాటు ఇతర సాయాలు లపై అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కేసుల విచారణ వేగవంతం చేసి బాధితులకు పునరావాసంపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, జిల్లా న్యాయసేవాసంస్థ కార్యదర్శి దీప్తి, దేవరకొండ ఏఎస్పీ మౌనిక, ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ హరికృష్ణ, సీడబ్ల్యూసీ చైర్మన్ కృష్ణ, సభ్యులు మోహన్‌రావు, హరిత, శ్రీధర్, భరోసాకేంద్రం ఎస్ఐ అంజలి, బాలల పరిరక్షణ వేదిక అధికారి గణేశ్, నళిని, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

12న అరుణాచల గిరి ప్రదర్శనకు ప్రత్యేక బస్సులు

నల్లగొండ సిటీ, మార్చి 3 : పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదర్శనకు ఈ నెల 12న సాయంత్రం 7 గంటలకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పౌర్ణమికి రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. అరుణాచలం వేళ్లే భక్తులకు ఏపీలోని కాణిపాకం, తమిళనాడులోని వేలూరు గోల్డెన్ టెంపుల్ దర్శనం కూడా ఉంటుందని తెలిపారు. వివరాలకు ఆయా బస్‌స్టేషన్లలో సంప్రదించాలని తెలిపారు.

పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేయాలి : సీపీఎం

చిట్యాల, మార్చి 3 : గ్రామాల్లో పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేశ్, అవిశెట్టి శంకరయ్య డిమాండ్ చేశారు. మండలంలో ఉరుమడ్లలో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై సీపీఎం నాయకులు సోమవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని నిరుపేద కుటుంబాల కోసం 47వ సర్వే నంబర్‌లో ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం రెతుల నుంచి కొనుగోలు చేసి ఏండ్లు గడుస్తున్నా నేటికీ పంపిణీ చేయలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, మండల నాయకులు ఐతరాజు నర్సింహ, పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి బెలిజ మల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

గిరిజన సంఘం నియోజవర్గ ఉపాధ్యక్షుడిగా శివకుమార్

తిరుమలగిరి(సాగర్), మార్చి 3: తెలంగాణ గిరిజన సంఘం నియోజవర్గ ఉపాధ్యక్షుడిగా మండలంలోని నాయకునితండాకు చెందిన సపవాత్ శివ కుమార్ నియమితులయ్యారు. సోమవారం నియోజకవర్గ అధ్యక్షుడు లాలూనాయక్, కార్యదర్శి రమేశ్‌నాయక్ ఆయనకు నియామకపత్రం అందించారు. ఈ సందర్భగా శివ కుమార్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

విజేత కళాశాలలో జాబ్ మేళా

మిర్యాలగూడ, మార్చి 3: పట్టణంలోని విజేత డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం నెవ్లాండ్ ఫర్ ఎంఎస్ఎన్ ల్యాబోరేటరీస్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా నిర్వహించిన రాత పరీక్ష, ఇంటర్వ్యూకు 28 మంది అభ్యర్థులు పాల్గొన్నారని, కంపెనీ ప్రతినిధులు మధు సూదన్, గణేశ్ 11 మందిని ఎంపిక చేసి నియామకపత్రాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, యువకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు : డీటీ

మాల్, మార్చి 3: రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తే క్రిమినల్ కేసు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు ఉంటాయని పౌర సరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తాసీల్దార్ మాచన రఘునందన్ హెచ్చరించారు. చింతపల్లి మండల కేంద్రంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచిన ఇంటిపై దాడి చేసి 30 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని నిల్వ ఉంచిన జహంగీర్‌పై కేసు నమోదు చేసి బియ్యాన్ని ఫౌర సరఫరాల సంస్థ గిడ్డంగికి తరలించినట్లు తెలిపారు. ఆయన వెంట అధికారులు వెంకటేశ్, పోలీసులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

నల్లగొండ ప్రభు; వైష్ణవి (ఫైల్)

నకిరేకల్, మార్చి 3 : బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన నకిరేకల్ పట్టణంలోని బైపాస్‌లో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం తుమ్మలపహాడ్ గ్రామానికి చెందిన నల్లగొండ ప్రభు(25) ఆటోడ్రైవర్. భార్యతో విడాకులు తీసుకొని ఒంటరిగా ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన పులగుజ్జు నరేశ్, సూర్యాపేట మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన వైష్ణవి(24) ఎనిమిదేండ్ల క్రితం ప్రేమవివాహం చేసుకున్నారు. వీరికి కూతురు, కొడుకు ఉన్నారు. వైష్ణవి భర్తతో మనస్పర్థలు రావడంతో పిల్లలను తీసుకొని టేకుమట్ల గ్రామంలోని తన తల్లిగారి ఇంటి వద్దకు వచ్చి ఉంటోంది. ఈ క్రమంలో నల్లగొండ ప్రభు, పులగుజ్జు వైష్ణవి మధ్య పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఆదివారం సాయంత్రం ప్రభు వైష్ణవిని తీసుకుని బైక్‌పై నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టుకు వెళ్లాడు. సోమవారం తెల్లవారుజామున తిరుగు ప్రయాణమవగా నకిరేకల్ బైపాస్‌లోని తాటికల్ ఫ్లైఓవర్ వద్ద గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. దాంతో ప్రభు, వైష్ణవి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ లచ్చిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను నకిరేకల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుల బంధువుల ఫిర్యాదుల దృష్ట్యా మృతదేహాలను ఫోరెన్సిక్ పరీక్షల కోసం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు.

ఇబ్రహీంపట్నం వద్ద రోడ్డు ప్రమాదంలో యరగండ్లపల్లి వాసి మృతి

భార్య,కూతురికి తీవ్రగాయాలు

జంగయ్య(ఫైల్ ఫొటో)

మర్రిగూడ, మార్చి 3 : రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని యరగండ్లపల్లి గ్రామానికి చెందిన మైలారం జంగయ్య(27) మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగయ్య తన భార్య, కూతురుతో కలిసి బైక్‌పై యరగండ్లపల్లి నుంచి హైదరాబాద్‌కు బయల్దేరాడు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం శివారులో గురునానక్ కాలేజీ వద్ద ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దాంతో జంగయ్య అక్కడికక్కడే మృతి చెందగా భార్య, కూతురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మైలారం జంగయ్య బతుకు దెరువుకోసం హైదరాబాద్‌కు వెళ్లి భార్యాపిల్లలతో అక్కడే ఉంటున్నాడు. ఆదివారం బంధువుల వివాహానికి గ్రామానికి వచ్చి జంగయ్య సోమవారం తిరిగి హైదరాబాద్‌కు వెళుతుండగా ప్రమాదానికి గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. జంగయ్య మృతితో యరగండ్లపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

హాలియాలో రెచ్చిపోయిన దొంగలు

● పగలే మూడు ఇండ్లల్లో చోరీ

హాలియా, మార్చి 3 : హాలియా దొంగలు రెచ్చిపోయారు. సోమవారం మధ్యాహ్నం మున్సిపాలిటీ పరిధిలోని సాయిప్రతాప్‌నగర్‌లో మూడు ఇండ్లల్లో చోరీకి పాల్పడ్డారు. ఎస్ఐ సతీశ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సాయిప్రతాప్‌నగర్‌లో నివాసం ఉంటున్న రిటైర్డ్ వెటర్నరీ ఉద్యోగి తుమ్మరకోటి రామలింగయ్య ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగుల గొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాలో ఉన్న 47.5 గ్రాముల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. అదే ఇంటిపై అద్దెకు ఉంటున్న శాగం వెంకటేశ్వర్‌రెడ్డి ఇంటికి తాళం వేసి ఉండగా.. తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న 10 తులాల వెండి, 10 వేల నగదును ఎత్తుకెళ్లారు. పక్కన ఉన్న అలుగుబెల్లి ఇంద్రారెడ్డి ఇంట్లోకి చోరీకి ప్రయత్నించారు. సాయంత్రం ఇండ్లకు వచ్చిన బాధితులు తమ ఇండ్లల్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సతీశ్‌రెడ్డి ఇండ్లను పరిశీలించారు. క్లూస్‌టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

14న నల్లగొండలో ఎమ్మార్పీఎస్ ప్రదర్శన

● ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

నల్లగొండ రూరల్, మార్చి 3 : ఈ నెల 14న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో నల్లగొండలో నిర్వహించే మహాప్రదర్శనకు మందకృష్ణ మాదిగ రానున్నట్లు సమాఖ్య జిల్లా కోఆర్డినేటర్ బోడ సనీల్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ శాస్త్రీయంగా చేయాలని, మాదిగలకు కమిషన్ నివేదిక ప్రకారం 11 శాతం కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 4 నుంచి 10 వరకు గ్రామాలు, మండలాల్లో డప్పు బృందాలతో ప్రదర్శనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం, నాయకులు మేడి శంకర్, కొమిరి స్వామి, సుదర్శన్, గోపాల్, కమలమ్మ, మోహన్, బొజ్జ దేవయ్య, శివశంకర్, ప్రతాప్ నరేశ్ పాల్గొన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు : తాసీల్దార్

నార్కట్‌పల్లి, మార్చి 3 : మండలంలోని అమ్మనబోలు మూసీ వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తాసీల్దార్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మూసీ వాగు నుంచి కొంతమంది ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు సోమవారం రెవెన్యూ సిబ్బంది వాగును పరిశీలించారు. అక్కడ నాలుగు ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తుండగా అధికారులు ట్రాక్టర్ తాళాలను, వారి సెల్‌ఫోన్లను తీసుకున్నారు. ఇంకా ఏమైనా ట్రాక్టర్లు ఉన్నాయా అని చూసేందుకు వాగు లోపలికి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ట్రాక్టర్ డ్రైవర్లు వేరే తాళం చెవులతో ట్రాక్టర్లను స్టార్ట్ చేసి పరారయ్యారు. వారి సెల్ ఫోన్ల ఆధారంగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తాసీల్దార్ తెలిపారు,

ప్రభుత్వ పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం

మునుగోడు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో విద్యార్థులు

మర్రిగూడ, మార్చి3 : మండలంలోని శివన్నగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా, అధికారులుగా వ్యవహరించి అలరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మర్రిగూడ : స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

మునుగోడు : మండల కేంద్రలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.అంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో పన్నులు వసూలు చేయాలి

● డీపీఓ వెంకయ్య

సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ వెంకయ్య

కట్టంగూర్, మార్చి 3 : గ్రామాల్లో పన్ను బకాయిలను వంద శాతం వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కొండ వెంకయ్య ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఇంటి పన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, నెలాఖరులోగా బకాయి లేకుండా వసూలు చేయాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో బోర్లు, పైపులైన్ల మరమ్మతులు చేపట్టడంతో పాటు అవరమైతే రైతుల బోర్లను అద్దెకు తీసుకోవాలన్నారు. సమావేశంలో డివిజన్ పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞాన ప్రకాశ్‌రావు, ఇన్‌చార్జి ఎంపీఓ చింతమల్ల చలపతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగు నీటి సమస్య రాకుండా చూడాలి

● డబ్బికార్ మల్లేశ్

సమావేశంలో మాట్లాడుతున్న డబ్బికార్ మల్లేశ్

మిర్యాలగూడ, మార్చి 3: వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్ అన్నారు. సోమవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండలు అధికమవుతున్నందున భూ గర్భ జల మట్టం కిందికి పడిపోతున్నదని, దాంతో నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని అన్నారు. గ్రామాల్లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులను వెంటనే శుభ్రపర్చి నీటితో నింపాలన్నారు. తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ముడావత్ రవినాయక్, వినోద్ నాయక్, అయూబ్, అంజద్‌పాషా పాల్గొన్నారు.

భర్త దాడిలో గాయపడిన మహిళ మృతి

తిప్పర్తి, మార్చి 3: కుటుంబ తగాదాల నేపథ్యంలో భార్యపై భర్త దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సర్వారం గ్రామానికి చెందిన బండారి మహేశ్వరి(23) వివాహం కేతేపల్లి మండలం బండకింది‌గూడెం గ్రామానికి చెందిన బండారి శ్రీకాంత్‌తో కొన్నేండ్ల క్రితం జరిగింది. వారికి కుమారుడు, కూతురు ఉన్నారు. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. వారి సూచన మేరకు సంవత్సరం క్రితం వారు సర్వారం గ్రామంలో నివాసముంటున్నారు. అయినా శ్రీకాంత్ తన ప్రవర్తన మార్చుకోకుండా మహేశ్వరిని అనుమానిస్తూ గొడవపడే వాడు. ఈ నెల ఒకటో తేదీన మధ్యాహ్నం మహేశ్వరితో గొడవపడి ఆమె తలను గోడకేసి కొట్టడంతో పాటు ఛాతిపై, కడుపులో తన్నడంతో తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు ఆమెను నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె ఆదివారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి మైనం లింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తిప్పర్తి ఎస్ఐ సాయి ప్రశాంత్ తెలిపారు.

వేసవిలో సరైన పశుపోషణతోనే పాల దిగుబడి

● పశువైద్యాధికారి రమాదేవి

మిర్యాలగూడ రూరల్,మార్చి 3 : వేసవిలో సరైన పశు పోషణ ఉంటేనే ఆశించిన పాల దిగుబడి వస్తుందని మండల పశు వైద్యాధికారి నాయిని దుర్గారమాదేవి అన్నారు. సోమవారం మండలంలోని సుబ్బారెడ్డిగూడెంలో రైతులకు పశుపోషణపై అవగాహన కల్పించారు. పశువులకు సాధ్యమైనంత వరకు తాగునీటిని అందుబాటులో ఉంచాలని, అధికంగా పచ్చి మేతను ఇవ్వాలని సూచించారు. పశువులను ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే ఆరు బయటకు తీసుకెళ్లాలన్నారు. రైతులకు పచ్చి గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయిని, సాగు నీరు అందుబాటులో